



నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com


నిజామాబాద్
కామారెడ్డి

సోమవారం 19 మే 2025 3 పేజీలు

# లోన్ కడుతారా.. పరువు తియ్యమంటూరా..






**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**

యెంకి పెళ్లి సుబ్బి సావుకొచ్చిందన్నట్టు, అవసరం ఉండి థర్డ్ పార్టీ ఆప్‌లో లోన్ తీసుకున్నవాళ్లు ఒక్కరైతే కాంటాక్ట్ లిస్టులో ఉన్న వాళ్లను టార్గెట్ చేస్తున్నారు. సదురు కంపెనీ వాళ్లు, తమ వద్ద మీ గ్రామానికి చెందిన పలానా వ్యక్తి లోను తీసుకున్నాడు కట్టడం లేదు, కట్టకపోతే మీరు కడుతారని మీ నంబర్ ఇచ్చారని ఫోన్లు రావడంతో ఏం తెలియని అమాయకులు లబోదిబోమంటున్నారు. 2లో

- థర్డ్ పార్టీ యాప్ లోన్ తీసుకున్నది ఒక్కరు, ఫోన్లతో వేధిస్తున్నది మరొక్కరిని
- నియోజకవర్గంలో పెరిగిన ఆప్ లోన్ల ఫోన్ కాల్స్...
- లోన్ తీసుకున్న వ్యక్తి వద్దనుండి వ్యక్తిగత డాటతో ఇతరులకు ఫోన్...అసభ్యకరంగా వేధింపులు

### అగ్ని ప్రమాద ఘటనతో ఉలిక్కిపడ్డ

# పారిశ్రామిక ప్రాంతం

- అగ్ని ప్రమాదాలకు ఆస్కారం ఉన్న పరిశ్రమలు
- బయట పడని ఎన్నో అగ్ని ప్రమాద ఘటనలు
- ఇప్పటికైనా తనిఖీలు చేపడుతారాలి
- అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్



**సూర్య- బిక్కనూర్**

హైదరాబాద్ లో ఆదివారం అగ్ని ప్రమాదం సంభవించి 17 మంది మృతి చెందడంతో మండలంలో ఉన్న పారిశ్రామిక ప్రాంతం ఉలిక్కిపడింది. మండలంతోపాటు రాజంపేట, కామారెడ్డి మండలాల పరిది లో పెద్ద ఎత్తున పరిశ్రమలు ఉన్నాయి. గతంలో అగ్ని ప్రమాదాలు సంభవించి పలు కంపెనీలలో కార్మికులు అగ్నికి ఆహుతి అయిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. పరిశ్రమలు ఏర్పాటు చేసే ముందు అగ్నిమాపక సేఫ్టీ బృంద సభ్యులు పరిశ్రమలను పూర్తిగా తనిఖీ చేసిన అనంతరం సర్టిఫికెట్ జారీ చేస్తారు. అలాగే అగ్ని ప్రమాదాల నివారణకు ఆయా కంపెనీలలో (మిగతా 2లో)



# భవానిపేటలో బ్లాస్టింగ్

### - ముగ్గురిపై బ్లాస్టింగ్ కేసు నమోదు

**సూర్య,లింగంపేట్**

లింగంపేట్ మండలంలోని భవానిపేట్ గ్రామ పరిసరాల్లో ఆదివారం బాంబు పేలుల్లతో చుట్టుపక్కల ఇల్లు దెబ్బ తిన్నాయని గ్రామస్తుల తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి భవానిపేట్ గ్రామానికి చెందిన దర్శనం సిద్ధిరాములుకు చెందిన వ్యవసాయ భూమిలో ల్యాండ్ డెవలప్మెంట్‌లో భాగంగా బండరాళ్లను తొలగించేందుకు బాంబులు అమర్చి అట్టిరాలు ఎగిసి పడకుండా ఉండేందుకు జెసిబితో బండపై మట్టి పోసే క్రమంలో బాంబు మిస్ఫైర్ అయి బ్లాస్టింగ్ కావడంతో బండరాళ్లు ఎగిసిపడి బిట్ల పోశెట్టి,అర్ల పోచయ్య,బైక్లు ధ్వంసం అయ్యాయని బాధితులు ఆరోపించారు. ఇండ్ల



పైకి రాళ్ళు ఎగసి పడ్డయన్నారు. విషయం తెలుసుకున్న ఎల్లారెడ్డి సర్కిల్ ఇన్స్పెక్టర్ రవీందర్ నాయక్, లింగంపేట ఎస్సై వెంకట్రావ్,ప్రొభిషన్ ఎస్సై రాఘవేంద్ర, సంఘటన స్థలానికి వెళ్లి బాంబు బ్లాస్టింగ్ జరిగిన తీరును పరిశీలించారు. పొలం (మిగతా 2లో)



# లోన్ కడుతారా... పరువు తియ్యమంటారా

సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి

## సంబంధం లేని వ్యక్తులకు ఫోన్లు...కుటుంబంలో గొడవలు

లోన్ తీసుకున్న వ్యక్తుల వ్యక్తిగత డేటాను తీసుకున్న లోన్ కంపెనీ ఆ వ్యక్తి ఫోన్ లో సేవ్ చేసుకున్న పేర్ల ఆదారంగా ఫోన్లు చెయ్యడం మొదలు పెడుతున్నారు. ఉదాహరణకు ఫోన్‌లో బాబాయ్ అని సేవ్ చేసుకుంటే ఆ వ్యక్తికి ఫోన్ చేసి ఫలాన వ్యక్తికి మీరు బాబాయ్ అవుతారట కదా,అతను లోన్ తీసుకొని కట్టడం లేదు ,మీ నంబర్‌ను మద్దతుదారుడిగా ఇచ్చాడు. ఆ డబ్బులు మీరే కట్టాలని దాబాయిస్తున్నారు. కొందరు బయపడి కట్టినవాళ్లు ఉన్నారు. మరికొందరు ఏం అర్థం కాకా అయోమయానికి గురవుతున్నారు.

**లోన్ ఆప్ పెట్టిన సిచ్చూ....**

గత వారం రోజుల క్రితం ఓ గ్రామానికి చెందిన వ్యక్తి గతంలో లోన్ తీసుకొని కట్టడం లేదు,ఆ కంపెనీ వాళ్లు అదె గ్రామానికి చెందిన అతని మిత్రుడి నంబర్ కు కాల్ చేసి మీ అబ్బాయి ఫలానా వ్యక్తికి జమానత్(డబ్బులు ఇవ్వకుంటే నేను ఇస్తా) ఉన్నాడు,అతను నలుబైవేలు ఇచ్చేది ఉంది,మీరు ఇస్తారా లేకా పోలీసు ష్టేషన్ లో ఫిర్యాదు చెయ్యమంటారా,మీ గ్రామ సర్పంచ్‌కు చెప్పమంటరా అని బెదిరించారు, భయపడ పోయిన ఆ వ్యక్తి తన కొడుకును చితకబాదాడు, దీంతో కుటుంబ కలహాలు మొదలయ్యాయి, అసలు వ్యక్తి వద్దకు వెళ్లి నిలదీస్తే మీ నంబర్ నేను ఇవ్వలేదు,మీకు నాకు ఎలాంటి సంబంధం లేదు అనటం కోసం మెరుపు.

**ఫోన్ లో ఉన్న నంబర్లే టార్గెట్..**

లోను తీసుకునే ఆత్రుతతో సదరు కంపెనీ పంపించిన లింకును ఓపెన్ చేసి ప్రతి నిబంధన చదవకుండా అన్నిటిని ఓకే చేయడం వల్ల ఫోన్లో ఉన్న కాంటాక్ట్ డేటా తో పాటు వివిధ రకాల ఫోటోలు కూడా వారి చేతికి చిక్కుతాయి లోన్ అమౌంట్ కట్టనప్పుడు ఫోటోలను మార్ఫింగ్ చేసి కాంటాక్ట్ లో ఉన్న ఇతరులకు అసభ్యకరమైన ఫోటోలు పంపించి బెదిరిస్తారు, వీటిని చూసి కొందరు తట్టుకోలేక మనస్థాపానికి గురి చెందడం పరువు పోతుందని ఆత్మహత్యాయ త్నానికి ఒడిగట్టడం జరుగుతుంది. డబ్బులు తీసుకున్న నెల నుండి ఆ డబ్బులు పూర్తిస్థాయిలో అప్పచెప్పేంతవరకు సదురు కంపెనీ చేతిలో లోన్ తీసుకున్న వ్యక్తి ఉన్నట్లుగానే భావించాలి, ముందుగా వడ్డీ రేట్లు తక్కువగా చెప్పి ఆ తర్వాత రోజుకో రేటు పెంచి మోసాలకు పాల్పడుత న్నారు, వెయ్యి రూపాయలు లోన్ తీసుకుంటే నెలలోపు చెల్లిస్తే 1100 నుండి 1300 చెల్లించాలి, ఒకవేళ సమయానుసారం చెల్లించకపోతే రోజురోజుకు వడ్డీ వేసి నడ్డి విరుస్తున్నారు, గ్రామం పట్టణం ఇలా తేడా లేకుండా సదరు వ్యక్తికి సంబంధించిన వ్యక్తిగత డాటా ను ఉపయోగించుకుని పరువు తీస్తున్నారు దీంతో చాలామంది బయటకు చెప్పుకోలేక లోపల మధనపడుతూ మనస్థాపానికి లోనవుత న్నారు. అవసరం ఎంతైనా ఉన్నా మిత్రులతో కానీ కుటుంబ సభ్యులతో గాని సంప్రదించి నేరుగా డబ్బులు తీసుకోవాలి కానీ ఇలా లోన్ అప్ ద్వారా డబ్బులు తీసుకుంటే రానున్న రోజుల్లో తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతాయని ఓ పక్క సైబర్ అధికారులు పోలీసులు చెప్పినప్పటికీ కొంతమంది వాటిపైనే ఆధారప డుతున్నారు, సమస్య ఎక్కువగా అయినప్పుడు మళ్ళీ పోలీసులను ఆశ్రయిస్తు న్నారు, ఒకరు లోను తీసుకుంటే అతనికి సంబంధించిన ప్రతి ఒక్కరిని బాధితులను చేస్తూ వేధించడం దాంతో పాటు వారి పరువు తీస్తున్నారు. ఇకనైనా ఆన్లైన్లో ఎలాంటి లోన్ లు తీసుకోవద్దని ప్రజలు యువకులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

# అగ్ని ప్రమాద ఘటనతో ఉలిక్కిపడ్డ పారిశ్రామిక ప్రాంతం

(మొదటి పేజి తరువాయి)

అవగాహన సదస్సులు నిర్వహించి, ప్రమాదాలు సంభవించినప్పుడు ఎలా వ్యవహరించాలనే అంశాలపై ఎప్పటికప్పుడు అగ్నిమాపక సిబ్బంది పర్యవేక్షణ ఉండాలి. కానీ ఏదైనా పరిశ్రమలలో అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు తప్ప ఫైర్ సిబ్బంది పట్టించుకున్న దాఖలాలు లేవు. పరిశ్రమలతో పాటు పరిశ్రమలలో పనిచేసే వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులు వందల సంఖ్యలో పరిశ్రమల చుట్టుపక్కల ప్రాంతాలలో ఇరుకు గదులలో నివసిస్తున్నారు. ఈ విషయంలో అగ్నిమాపక సిబ్బంది కేవలం తూతూ మంత్రంగా తనిఖీలు చేసి చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. పరిశ్రమల సంగతి పక్కన పెడితే పట్టణాలతోపాటు గ్రామాలలో కూడా అపార్ట్ మెంట్ ల నిర్మాణం పెరిగింది. జనాభా అవసరాల మేరకు అపార్ట్మెంటులలో ఉద్యోగులు, కార్మికులు ఇరుకు గదులలో నివాసం ఉంటున్నారు. ఏదైనా షార్ట్ సర్క్యూట్ ప్రమాదం సంభవిస్తే ఫైర్ ఇంజన్ రావాలంటే సుమారు గంట సమయం పడుతుంది. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు, దీపావళి పండుగ సమయంలో తప్ప అగ్ని మాపక అధికారులు కనీసం మండల కేంద్రంలో ఏర్పాటు చేసే మండల సమావేశానికి కూడా హాజరుకారని ఆరోపణలు ఉన్నాయి. అగ్ని ప్రమాదాల నివారణ కోసం మండల కేంద్రంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని, ఫైర్ స్టేషన్ ఏర్పాటు వల్ల మండలంలోని గ్రామాలతో పాటు, రాజంపేట, దోమకొండ మండల ప్రజలకు అందుబాటులో ఉంటుందని గత కొన్ని సంవత్సరాలుగా మండల ప్రజలు కోరుతున్న ఇప్పటివరకు ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయలేదు. అగ్నిమాపక సిబ్బంది ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడి ప్రైవేటు విద్యా సంస్థలు, దుకాణ సముదాయాలు, వివిధ కుటీర పరిశ్రమలలో తనిఖీలు చేపట్టి ఫైర్ సేఫ్టీ ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# నిత్య అన్నదాన ట్రస్ట్ డైరెక్టర్ రవిగౌడ్ కు ఘనసన్మానం

సూర్య,లింగంపేట్

వేములవాడ అఖిలభారత శ్రీ రాజరాజేశ్వరి,రేణుక ఎల్లమ్మ గౌడ నిత్యాన్నదాన సత్ర,భవన ట్రస్ట్ డైరెక్టర్గా ఎన్నికైన సంఘన్నగారి రవీందర్ గౌడ్ కు ఆదివారం గౌడ సంఘం సభ్యులు,ఆయా కుల సంఘాల నాయకులు ఆయన నివాసములో శాలువ కప్పి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తానని నిత్య అన్నదాన ట్రస్ట్ డైరెక్టర్ బాధ్యతలు అప్పగించడం అదృష్టంగా భావిస్తున్నాను అన్నారు.ప్రతి మంగళవారం లింగంపేట మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్న మన్నారు.సామాజిక సేవా కార్యక్రమాలు చేయడం జరుగుతుం దన్నారు. డైరెక్టర్ నియమించడంతో నాపై మరింత బాధ్యత పెరిగింద న్నారు.సేవా కార్యక్రమం చేయడం నా అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు .కుల మతాలకతీతంగా మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తానని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం మాజీ అధ్యక్షుడు శంకర్ గౌడ్, మనోహర్ గౌడ్,లక్ష్మీనారాయణ గౌడ్,ఈశ్వర్ గౌడ్,వైశ్య సంఘం నాయకులు వేణు,నగేష్,శ్రీధర్ అంజయ్య, సిద్దాగౌడ్, నర్సాగౌడ్,ఆయా కుల సంఘాల నాయకులు తదితరులున్నారు.





# పూర్వ విద్యార్థులు సమాజాభివృద్ధికి తోడ్పడాలి

## - రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు హనుమాన్లు

సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి

పూర్వ విద్యార్థులు సమాజ అభివృద్ధికి తోడ్పడాలనీ రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు హనుమన్లు అన్నారు.2003- 2004 వ సంవత్సరంలో ధర్మారావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థులు అంకం రాజు, డాక్టర్ సంజన, సమీనా , జమీల్, రమేష్ రెడ్డి పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. 21 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులు ఒకచోట కలుసుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన గురువులకు సన్మానం చేశారు. పూర్వ విద్యార్థులకు చదువు నేర్పించిన ఉపాధ్యాయులు వెంకటాచారి, ఇంద్ర శేఖర్, విజయరామరాజు, నరేందర్, వెంకటేశం, హీరాలాల్, రాజలింగం హాజరయ్యారు. ఉపాధ్యాయులతో తమకున్న అనుబంధాన్ని విద్యార్థులు తమ ప్రసంగాల్లో తెలియజేశారు. సమాజ సేవలో భాగస్వాములు కావాలని ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులకు దిశనిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులతో పాటు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# భవానిపేటలో బ్లాస్టింగ్

(మొదటి పేజి తరువాయి)

యజమాని దర్శనం సిద్ధిరాములు,బాంబు పేలుళ్లకు పాల్పడిన వ్యక్తులు ఓడ్డే రమేష్, నర్సింలును పోలీసులు అదుపులోకి తీసుకుని ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. బండను పేల్చేందుకు 30 బాంబులు ఏర్పాటు చేసినట్లు అందులో కొన్ని పేలి మరికొన్ని పేలకపోవడంతో బాంబులను గుర్తించే మిషన్ తీసుకువచ్చి వాటిని తొలగించనున్నట్లు తెలిసింది.దర్శనం సిద్ధరాములు పెట్టిన 30 బాంబులు మొత్తం పేలి ఉంటే పక్కనున్న సబ్ స్టేషన్ గ్రామంలో కొన్ని ఇల్లు పూర్తిగా ధ్వంసం అయ్యేవని గ్రామస్తులు పేర్కొన్నారు.



# సంఘటన జరిగిన స్థలాన్ని పరిశీలించిన ఉపముఖ్యమంత్రి, షబ్బీర్ అలీ

సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి

ఓల్డ్ సిటీలోని గుల్జార్ హౌస్ అగ్నిప్రమాదం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. అగ్ని ప్రమాదం జరగడం దురదృష్టం..చాలా బాధకు గురిచేసింది. ఉపాముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారు, మంత్రి పొన్నం ప్రభాకర్‌లతో కలిసి ప్రమాద స్థలాన్ని పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ అగ్ని ప్రమాదానికి గల కారణాలపై అధికారులను అడిగి తెలుసు కున్నాము. మృతులు, బాధితుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది.గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాము.



# ఆపరేషన్ సిందూర్ , విజయవంతమైన ర్యాలీలో పాల్గొన్న కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణ రెడ్డి

సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి

ఆపరేషన్ సిందూర్ విజయం నేపథ్యంలో, పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని ఊచకోత కోసిన భారత సైన్యానికి అభినందనలు, ప్రశంసలు తెలుపుతూ, త్రివిధ దళాలు అందించిన సేవలకు కృతజ్ఞతగా మరియు మన ఐక్యత చాటడానికి ఆదివారం రోజున ట్యాంక్ బండ్ పై నిర్వహించిన తిరంగా ర్యాలీ లో తోటి బీజేపీ శాసన సభ్యులతో పాటు పాల్గొన్న కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ తరపున ప్రశంస పత్రాలు అందుకున్న ఆదర్శ పాఠశాల విద్యార్థినీలు

సూర్య ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి ఆదర్శ పాఠశాల విద్యార్థినిలు పదవ తరగతిలో ఉత్తమ మార్కులు పొందిన నలుగురు విద్యార్థులకు తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లాలోని సాందీపనికళాశాలలో శనివారం తెలంగాణఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఉత్తర తెలంగాణ జోన్ సెక్రెటరీ చందపురం శ్రీకాంత్ఆధ్వర్యంలో ఆదర్శ పాఠశాల విద్యార్థినిలు, మానస, పింకీబాయి, అంజలి, పావని విద్యార్థినులకు ఆయన చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందుకున్నారని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ గాంధీ తెలిపారు. సామాజిక, ఆర్థిక ఉపాధి అవకాశాలు పొందాలని వారికి మంచి భవిష్యత్తు ఉన్నదని చెప్పారు. విద్యార్థుల ఆలోచనలు ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రభాకర్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సభ్యులు తదితరు లు ఉన్నారు.



# రక్తదానం- మరొకరికిప్రాణం

**సూర్య - బాన్సువాడ**

రక్తదానంతో మరొకరి ప్రాణం నిలబెట్టవచ్చున ని, ఆరోగ్యవంతుడైన మనిషి ఎన్నిసార్లు రక్తదా నం చేసిన ఆరోగ్యంగానే ఉంటారని ఏ ఎస్ ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు అయ్యల సంతోష్ కుమార్ అన్నారు. ఆదివారం ఏ ఎస్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రి లో రక్తపు నిల్వలు తక్కువగా ఉండటంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని, ప్రతి 3 నెలలకు



ఒకసారి రక్తం ఇవ్వడం వలన గుండె పోటు, బరువు తగ్గడం ,BP, కంట్రోల్ ఉండటంతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. మనిషి ఆరోగ్యానికి ఎలాంటి నష్టం ఉండదని అన్నారు.18 నుండి 60 సంవత్సరాల వయస్సు ఎవరైనా రక్త దానం చేయవచ్చన్నారు. ఒక మనిషి రక్తం దానంతో ముగ్గురి ప్రాణాలను కాపాడవచ్చు అన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేస్తూ మరొకరికి ప్రాణం ఇవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తుల శ్రీనివాస్, ఫౌండేషన్ సభ్యులు దర్శనం పర్వయ్య, వాగ్ మారే శివ శంకర్,పవన్ కుమార్, బేజుగం సంతోష్, షేక్ ఖయ్యూమ్ టీచర్, సిబ్బంది ఆనంద్, శ్రీనివాస్, రఘు తదితరులు పాల్గొన్నారు.

## తిరంగా ర్యాలీకి బీజేపీ పూర్తి మద్దతు


**సూర్య - మోపాల్**



సిటిజన్ ఫోరమ్ ఆధ్వర్యం లో సోమవా రం నిర్వహిం చనున్న తిరంగా ర్యాలీకి బీజేపీ పూర్తి మద్దతునిస్తుంద ని జిల్లా అధ్యక్షుడు దినేష్ కులకర్ణి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఆపరేషన్ సిందూర్" లో త్రివిధ దళాల సైనికుల విజయం సాధించిన నేపథ్యంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.జిల్లా లోని అన్ని వర్గాల ప్రజలు, ప్రభుత్వం, ప్రయివేట్ ఉద్యోగులు, కుల సంఘాలు, వార్తకులు, స్వచ్ఛంద సంస్థలు, మైనారిటీలు, క్రైస్తవులు ర్యాలీలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. పహల్గామ్ లో పర్యాటకుల్లపై దాడి చేసిన భరత సైన్యం మాత్రం కేవలం ఉగ్రవాద స్థావారాలపై దాడి చేసిందని గుర్తు చేశారు. సమావేశంలో జిల్లా నాయకులు లక్ష్మి నారాయణ, కిషోర్,మాజీ కార్పొరేటర్లు మల్లేష్,శంకర్,తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ జడ్పీ చైర్మన్ దఫేదార్ రాజు

**సూర్య నిజాంసాగర్**



ఉమ్మడి నిజాంసాగర్ మండలంలో ఆదివా రం జరిగిన పలు వివాహ వేడుక కార్యక్రమాల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ దఫెదర్ రాజు పాల్గొన్నారు. వివాహ వేడుకల్లో పాల్గొన్న ఆయన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు గున్కుల్ సొసైటీ చైర్మన్ వాజిద్ అలీ, మాజీ సర్పంచ్ సంగమేశ్వర్ గౌడ్, మెతే రామా గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, సాయ గౌడ్, లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


**సూర్య నిజాంసాగర్**



నిజాంసాగర్, మహ మ్మద్ నగర్ మండలా ల్లోని గోర్గల్,మంగ్లూర్ ,గున్కుల్ గ్రామాల్లో ఆదివారం సిఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారు లకు పంపిణీ చేశారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు ఆదేశాల మేరకు చెక్కులను పంపిణీ చేయడం జరిగిందని ఆయా గ్రామాల నాయకులు తెలిపారు.ఎమ్మెల్యే కృషితో చెక్కులు త్వరగా వస్తున్నాయి అన్నారు.ఈ పంపిణీ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామా గౌడ్,గొర్గల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అజ్జం దుర్గయ్య, గోలి లక్ష్మణ్, పొన్నబోయిన రమేష్ జ్ఞానేశ్వర్, గున్కుల్ మాజీ సర్పంచ్, గంగి రమేష్, సాయ గౌడ్, కాశయ్య, మంగ్లూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చాకలి సాయిలు మాజీ ఉపసర్పంచ్ దత్తు, భూమయ్య, ఆగమయ్య, బద్రీనాథ్ లతోపాటు లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

## వస్త్రాలంకరణ శుభకార్యంలో పాల్గొన్న టిపిసిసి కార్యదర్శి

**సూర్య- బిక్కనూర్**




మండలంలోని రామేశ్వర్ పల్లికి చెందిన నాగర్తి రాంరెడ్డి కుమార్తెల వస్త్రాలంకరణ శుభకార్యం మండల కేంద్రంలోని స్థానిక ఎస్సీ గార్డెన్ లో ఆదివారం నిర్వహించారు. ఈ శు భకార్యానికి టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రతినిధి మహమ్మద్ ఇలియాస్ లు హాజరై చిన్నారులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ శుభకార్యంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీరామ్ వెంకటేష్, నాయకులు గంగాధర్, ఐరేని సందీప్, గడుగుల శ్రీనివాస్ నాయకులు ఉన్నారు

## శుభకార్యాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు

**సూర్య నిజాంసాగర్**



జుక్కల్ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఆదివారం జరిగిన వివాహ వేడుకలతో పాటు ఇతర శుభ కార్యాల్లో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు పాల్గొ



న్నారు. వివాహ వేడుకల్లో పాల్గొన్న ఆయన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు.కార్యక్రమాల్లో ఆయన తోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన మడేల్లయ్య ఆలయ వార్షికోత్సవాలు

**సూర్య- బిక్కనూర్**



మండల కేంద్రంలోని స్థానిక గ్రామ పంచాయతీ పక్కన ఉన్న మడేల్ల య్య ఆలయ వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమ య్యాయి. ఈ సందర్భంగా పట్టణ రజక సంఘం ఆధ్వర్యంలో వార్షికోత్సవాలను ప్రారంభించారు. ఉత్సవాలలో భాగంగా తొలి రోజు ఆలయంలో గణపతి పూజ, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణ పురవీధుల గుండా స్వామివారిని ఊరేగింపు నిర్వహించి ఆలయానికి తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా సోమవారం స్వామివారి కళ్యాణ మహోత్సవం నిర్వహించడం జరుగుతుందని పట్టణ రజక సంఘం సభ్యులు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఆవరణలో అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే షిండే

**సూర్య నిజాంసాగర్**



మండలంలోని గోర్గల్ గేటు వద్ద సాయి టీ ఫంక్షన్ హాల్లో ఆదివారం జరిగిన కొంద్ర రమేష్ కూతురి వివాహ వేడుక కార్యక్రమంలో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే పాల్గొన్నారు. వివాహ వేడుకల్లో పాల్గొన్న ఆయన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు మాజీ ఎంపీపీ పట్లోళ్ల జ్యోతి దుర్గారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మనోహర్, మాజీ ఎంపీటీసీ అనిల్ కుమార్, మాజీ సర్పంచ్ కమ్మరి కత్త అంజయ్య, గైని విట్టల్, రమేష్ గౌడ్, చాకలి రమేష్, మర్పల్లి రాములు, శ్రీకాంత్ రెడ్డి, బాబుమియా, దేవేందర్ రెడ్డి, రఘురాం రెడ్డి లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

**సూర్య- బిక్కనూర్**



రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పట్టణ అంబేద్కర్ సంఘ అధ్యక్షుడు దుబా సి భాను ప్రకాష్ చెప్పారు. ఆదివా రం పట్టణ అంబేద్కర్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. అధ్యక్షుడిగా దుబాసి భాను ప్రకాష్,ప్రధాన కార్యదర్శిగా ఉప్పల అఖిల్, కోశాధికారిగా జంగం రాజ శేఖర్,ఉపాధ్యక్షులుగా తాటికొండ స్వామి,పెరుముల ఎల్లేశ్, రామిండ్ల విన య్, కార్యదర్శులుగా ధ్యాగల కృష్ణ,తాటికొండ నవీన్, అనుముల నవీన్, కోటాని ప్రభాస్,సలహాదారులుగా జంగం ప్రభాకర్,రామాండ్ల రాజ్ కుమార్ , దుబాసి శ్రీకాంత్, పెరుముల ఉదయ్, సంయుక్త కార్యదర్శులుగా గోసు స్వామి, గోసు రాములను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల

**సూర్య- బిక్కనూర్**



మండలంలోని ఇసన్నపల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో దాతల సహకారంతో అను భవం ఉన్న ముగ్గురు విద్య వాలంటీర్లను పెట్టి విద్యను బోధిస్తూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దడం అభినందనీయమని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం పాఠశాల విద్యా వాలంటీర్లకు వేతనాలు చెల్లి స్తున్న దాతలను ఘనంగా సన్మానించారు. మాజీ సర్పంచ్ గుడిసె రాములు ఆధ్వర్యంలో 50 మంది ఉండే పాఠశాలలో ప్రస్తుతం 110 మంది విద్యార్థు లు విద్యను అభ్యసిస్తున్నారని, గ్రామంలోని ప్రతి విద్యార్థి ఈ సంవత్సరం ప్రభుత్వ పాఠశాలలోనే చదివే విధంగా కృషి చేస్తున్న దాతల సేవలు మరు వలేని వారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన డి సి ఓ

**సూర్య- బిక్కనూర్**



మండల కేంద్రంలోని వరి ధాన్యపు కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం డి సి ఓ రామ్మోహన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల కేంద్రంలో వరి ధాన్యపు కొనుగోళ్లను ఈనెల 25 లోపు పూర్తిచేయాలని సొసైటీ సిబ్బం ది ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో శివప్రసాద్, మానిటరింగ్ అధికారి నరేష్, సహకార సిబ్బంది, సొసైటీ సిబ్బంది ఉన్నారు.

## హెల్మెట్ లేని యువతకు కొత్త శిక్ష

**సూర్య - మోపాల్**




నిజామాబాద్ నగరంలో హెల్మెట్, లైసెన్స్ లేని యువతకు సీపీ సాయి చైతన్య కొత్త రకం శిక్ష విధిస్తున్నారు. గతంలో బైక్ నంబర్ తో చలాన్లు వేస్తుండగా, ఇప్పుడు రోడ్డు చౌరస్తాల్లో "హెల్మెట్ ప్రొటెక్ట్స్ యువర్ హెడ్ " అనే ప్లకార్డులతో గంటల పాటు నిల బెట్టి శిక్షిస్తున్నారు.ఈ పనిష్మెంట్ ద్వారా రోడ్డు భద్రత పై అవగాహనా కల్పించడం, హెల్మెట్ వడకం పట్ల యువతను చైతన్యం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

## పోగొట్టుకున్న ఫోన్లను వెతికి అందజేసిన ఎస్ఐ

**సూర్య ఏర్గట్ల**



నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల మండలంలోని పలు గ్రామాల నుండి ఫోన్లు పోగొట్టుకొని గతంలో ఫిర్యాదు చేసిన వారి యొక్క మొబైల్ ఫోన్ లను C.E.I.R పోర్టల్ ద్వారా వెతికి నాలుగు మొబైల్ లను ఎస్సై బి. రాము ఆదివారం రోజు ఏర్గట్ల పోలీస్ స్టేషన్ కు పిలిచి వారికి అందజేశారు. ఫోన్లు అందుకున్న ఫిర్యాదుదారులు ఎంతో సంతోషించి పోలీసు వారికి ధన్యవాదాలు తెలియ జేశారు.ఎవరైనా ఆకస్మాత్తుగా ఫోన్ పోయినచో వెంటనే పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయాలని ఎస్ఐ సూచించారు.